క్లుప్తంగా

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కేసులు



మనేకుర్తిలో అక్రమ కట్టడాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఆలూరు: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. మండలంలోని మనేకుర్తి గ్రామంలో రోడ్లు భవనాలశాఖ ఆధీనంలోనున్న స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మిస్తుండగా గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ఆర్‌ఐ బసన్నగౌడు, వీఆర్వో రవి అక్రమ కట్టడాన్ని పరిశీలించి సర్వే నంబర్లు, మ్యాప్‌లను గుర్తించారు. వారు మాట్లాడుతూ నిర్మాణం నిలిపివేయాలని, కొనసాగిస్తే కేసు నమోదు చేస్తామని ఆక్రమణదారుడికి సూచించారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

చిప్పగిరి: మండలంలోని సంగాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మీసాల ఈశ్వరప్ప అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. పార్టీ కన్వీనర్ మారయ్య, సర్పంచ్ ప్రేమ్ కుమార్, ఎంపీటీసీలు సుంకన్న, భీమలింగ, నాయకులు ఓబులేసు, నాగప్ప, లోకనాథ్, లింగన్న ఉన్నారు.

ఘర్షణ.. ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న వెంకటరమణ

హాలహర్వి: మండలంలోని అర్దగేరి గ్రామంలో మొహర్రం వేడుకల్లో భాగంగా డప్పు కొట్టే విషయంలో ఆదివారం ఘర్షణ చోటు చేసుకుంది. ఘర్షణలో వెంకటరమణ తలకు గాయాలయ్యాయి. బాధితుడిని వెంటనే ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

రిపేరీ చేస్తుండగా బైక్ దగ్ధం



దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

ఆలూరు రూరల్: రిపేరీ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి మోటార్ సైకిల్ కాలిపోయిన ఘటన సోమవారం మధ్యాహ్నం స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని మెకానిక్ షాపు ఆవరణలో చోటుచేసుకుంది. ప్రమాదంలో రూ.25 వేలు విలువ చేసే స్కూటర్ దగ్ధమైంది.మోటార్ సైకిల్ స్టార్ట్ కాకపోవడంతో ఓ వ్యక్తి మెకానిక్ దగ్గర వచ్చాడు. పవర్ సప్‌లై ప్లగ్ తీసి కిక్ కొడుతుండగా ప్లగ్ నుంచి వచ్చిన మంటలు పెట్రోల్ సరఫరా పైపుకు అంటుకుని ఒక్కసారిగా చెలరేగాయి. మెకానిక్ తెరుకునే లోపు వాహనం మొత్తం మంటలు వ్యాపించి దగ్ధమైంది.

టీడీపీ వేధింపులు ఆపాలి

పత్తికొండ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్కావెంజర్లపై టీడీపీ నాయకుల వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ తాలూకా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ రామలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణయ్య, తాలూకా అధ్యక్షుడు నెట్టికంటయ్య, స్కావెంజర్ల సంఘం జిల్లా కార్యదర్శి సుంకమ్మ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా అరకొర వేతనాలతో పనిచేస్తున్న వారిని టీడీపీ నాయకులు బలవంతంగా తొలగిస్తూ, ఆ పార్టీ కార్యకర్తలను చేర్పిస్తున్నారన్నారు. ఏఐటీయూసీ తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, సిద్దమ్మ, వెంకటలక్ష్మి, నాగవేణి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

చిప్పగిరి: గూడ్స్ రైలు కింద పడి గుర్తు తెలియని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నంచర్ల గ్రామంలోని మల్లప్ప గేట్ రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు..30 - 38 సంవత్సరాలు వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి పసుపు కలర్ రౌండ్ నెక్ టీ షర్టు, యజ్ఞోపవీతం ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు చెప్పారు.

విద్యార్థి బస్సు నడపండి

హొళగుంద: కర్ణాటక సరిహద్దులోనున్న మార్లమడికి గ్రామానికి విద్యార్థి బస్సు నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు, దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పంచగుండిగ వెంకటేష్, రంగప్ప, లంకెప్ప, గర్జప్ప, వీరేశ్, శేఖర్, శేకన్న తదితరులు తహసీల్దారు ప్రసాద్‌రాజుకు వినతి పత్రం అందజేశారు. వెంటనే విద్యార్థి బస్సు నడిపేలా చర్యలు చేపట్టాలని కోరారు.



నాపేరు ఇస్లావత్ కుమార్‌నాయక్. 29ఏళ్ల వయసు. తుగ్గలి మండలం బాటతండా. బీటెక్ పూర్తి చేశా. ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నా. చాలీచాలని జీతంతో నెట్టుకొస్తున్నా. గతంలో కూడా చంద్రబాబు ఇంటికో ఉద్యోగం, ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.2వేలు ఇస్తానన్నారు. ఉద్యోగం లేదు, భృతి రెండుసార్లు ఇచ్చి చేతులెత్తేశారు. కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్, ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు ఇస్తామని హామీనిచ్చింది. అయితే ఇంత వరకు నిరుద్యోగ భృతిపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. ఈ సారైనా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు కల్పించాలి. ఉద్యోగం లేని వారికి నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకోవాలి.



నాపేరు వినోద్‌కుమార్‌నాయక్. తుగ్గలి మండలం మీటే తండా. బీఏ చదివా. ఉద్యోగం లేక ఉన్న రెండున్నర ఎకరాల్లో సేద్యం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేష్ లక్షల్లో ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టగానే వాటి గురించి పట్టించుకోవడం లేదు. ఇంత వరకు నిరుద్యోగ భృతిపై నోరు పెదడం లేదు. గతంలో వారు నిరుద్యోగ భృతి ఎలా అమలు చేశారో అందరూ చూశారు.నిరుద్యోగ భృతి ఇస్తారన్న నమ్మకం మాకైతే లేదు. హామీల అమలుపై టీడీపీ నమ్మకం కల్పించాలి.



నాపేరు మూలింటి రవికుమార్, హోసూరు గ్రామం, పత్తికొండ మండలం. 2016లో జీఎస్సీ పూర్తి చేశా. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. అమ్మ గోవిందమ్మ, నాన్న మూలింటి కిష్టన్న ఇద్దరూ పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మేనమామ రామదుర్గం శ్రీనివాసులు సహకారంతో డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ప్రయత్నించినా దక్కలేదు. నిరుద్యోగిగా మిగిలిపోయా. కోచింగ్‌కు వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్నది. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి ప్రతినెలా చెల్లిస్తే ఏదైనా శిక్షణ పొంది ఉద్యోగం సాధిస్తా.

భృతి.. అందని ద్రాక్షేనా!



పత్తి పొలంలో పనిచేస్తున్న ఈ యువకుడి పేరు గోస్ గోపాల్. కృష్ణగిరి మండలం, టి.గోకులపాడు గ్రామం. 'బీకాం కంప్యూటర్స్ కర్నూలులోని ఎస్‌టీబీసీ కళాశాలలో 2013లో పూర్తి చేశా. అప్పటి నుంచి ఇప్పటి వరకు పలు ఉద్యోగ నియామక పరీక్షలు రాసినా ఉద్యోగం రాలేదు. గత ఐదారేళ్లుగా కాంట్రాక్టర్ వద్ద పనులు చేశా. ప్రస్తుతం పొలం పనులకు వెళ్తున్నా. తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూశా.. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సంపాదించి మలి వయస్సులో వారిని సుఖపెడుదామనుకున్నా. కానీ ఉద్యోగాలు లేక వ్యవసాయం చేస్తున్నా. నేను చదువుతున్నానని, నా తమ్ముడు వ్యవసాయం చేశాడు. వాడికి పెళ్లి చేశారు. ఉద్యోగం వస్తే పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నా. టీడీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీ వేగంగా చేయాలి. అలాగే ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి చెల్లిస్తాననే మాటకు కట్టుబడి ఉండాలి. అయితే ఇప్పటి వరకు హామీ అమలుకు చర్యలు చేపట్టకపోవడంపై ఆందోళన ఉంది'.

- ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగ, నిరుద్యోగ భృతి ఇస్తామని టీడీపీ హామీ
- అధికారంలోకి వచ్చి నెల గడిచినా విధి విధానాలు ప్రకటించని వైనం
- హామీపై నోరు మెదపని చంద్రబాబు
- ఆందోళనలో నిరుద్యోగులు
- అమలుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న యువత
- ఆలూరులో 74,572, పత్తికొండ నియోజకవర్గంలో 69,345 గృహాలు

'నిరుద్యోగాన్ని నిర్మూలించడంలో భాగంగా ప్రతి నిరుద్యోగికి ఉద్యోగవకాశాలు కల్పిస్తాం. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. అంతవరకు వారికి నిరుద్యోగభృతి కింద ప్రతి నెల రూ.3వేలు చెల్లిస్తాం..మేం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రక్రియ ప్రారంభిస్తా'మంటూ ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు చంద్రబాబు నాయుడు, లోకేష్ తదితరులు ప్రచారం చేశారు. నిరుద్యోగ భృతి అనే అంశాన్ని పదే పదే ప్రస్తావించారు. అయితే పాలనలోకి వచ్చి నెల పూర్తయినా హామీ అమలుకు కనీస చర్యలు చేపట్టకపోవడం, చివరకు విధి విధానాలు సైతం రూపొందించకపోవడంపై నిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అసలు.. హామీ అమలు చేసే అలోచన ఉందా అంటూ అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆలూరు రూరల్/పత్తికొండటౌన్: ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు..ప్రతి నిరుద్యోగికి యువగళం పథకం కింద నెలకు రూ.3వేలు చెల్లింపు. ఇదీ..కూటమి పార్టీలు తమ మేనిఫెస్టో సూపర్ సిక్స్‌లో ప్రకటించిన హామీ. అయితే ఇప్పటి వరకు నిరుద్యోగభృతి హామీ అమలుకు ప్రభుత్వం ఉపక్రమించకపోవడం నిరుద్యోగుల్లో ఆందోళన మొదలైంది. పథకం అమలుకు విధి విధానాలు ప్రకటించకపోవడం, పలుమార్లు సమావేశాలు నిర్వహించినా పథకం ఊసెత్తకపోవడంతో.. అసలు హామీ అమలు చేసే ఉద్దేశంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

స్పష్టత ఏదీ?

గతంలో చంద్రబాబు నిరుద్యోగభృతి చెల్లించిన తీరును ఉదహరిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చేందుకు సూపర్ సిక్స్ పేరిట హామీలు గుప్పించారు. ఇందులో ప్రధానంగా ఇంటికో ఉద్యోగం ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఉద్యోగం ఇచ్చే వరకు ప్రతి నిరుద్యోగికి నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ప్రతి నెలా అందిస్తామని హామీ ఇచ్చింది. అధికారం చేపట్టి నెలన్నర రోజులు కావస్తున్న ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ప్రకటనపై స్పష్టత ఇవ్వకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పీజీ, డిగ్రీ, ఇంటర్మీడియట్, పదవ తరగతి చదివి ఉద్యోగాల కోసం నియోజకవర్గంలో వేల మంది నిరుద్యోగులు ఉన్నారు. ఇందులో కొందరు ప్రైవేటు సంస్థల్లో ఉపాధి కోసం పనిచేస్తున్నారు. మరికొందరు వ్యవసాయం చేస్తూ.. పట్టణాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరందరూ ఉద్యోగాల నోటిఫికేషన్ ఎదురు చూస్తున్నారు. ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగభృతి ఇస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు.



ఉసూరుమనిపించిన డీఎస్సీ నోటిఫికేషన్..

డీఎస్సీ నోటిఫికేషన్ ఊరించి ఉసూరుమనిపించింది. మొదట్లో టెట్ అర్హత సాధించిన వారు డీఎస్సీ రాసేందుకు సిద్ధమై కోచింగ్ సెంటర్ల బాటు పట్టారు. ఇంతలో మరోసారి టెట్ నిర్వహించేందుకు పూనుకోవడంతో ఇప్పటికే అర్హత సాధించి వయస్సు పైబడిన నిరుద్యోగులు డీలా పడ్డారు. ఈ ఏడాదంతా వృథా కావడంతో నిరుత్సాహం చెందుతున్నారు. నిరుద్యోగభృతి వస్తే కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సిన అవసరం కొంత వరకు తగ్గుతుందని, తాము ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన మెటీరియల్‌కు, హాస్టల్‌లో ఉండటానికి, కోచింగ్ సెంటర్‌ల ఫీజు తదితరాలకు కొంతవరకు ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 74,572 గృహాలు ఉన్నాయి. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంది.

ఆలూరు నియోజకవర్గంలో మండలాల వారీగా గృహాలు..

మండలం	గృహాలు
ఆలూరు	15,616
ఆస్పరి	12,680
చిప్పగిరి	7,173
హాలహర్వి	8,883
హొళగుంద	12,650
దేవనకొండ	17,570
మొత్తం	74,572

పత్తికొండ నియోజకవర్గంలో మండలాలవారీగా ఇళ్ల సంఖ్య

పత్తికొండ	21,500
తుగ్గలి	9,872
మద్దికెర	10,847
క్రిష్ణగిరి	12,450
వెల్దుర్తి	14,676
మెత్తం	69,345

నిరుద్యోగ భృతి కోసం వేచిచూస్తున్నా



నేను డిగ్రీ బీఏ పూర్తి చేశాను. ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. ప్రస్తుతం ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నా. నిరుద్యోగ భృతి అమలుపై వెంటనే విధివిధానాలు విడుదల చేసి స్పష్టతనివ్వాలి. ఇచ్చిన హామీ విస్మరిస్తే ఆ ప్రభావం వేల కుటుంబాలపై ప్రభావం చూపుతుంది. – రాజు,నిరుద్యోగి,ఆలూరు

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



నేను ఏడాదిగా డీఎస్సీ కోసం సిద్ధమవుతున్నా. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. ఉద్యోగాలు ఇచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. నేను కుటుంబ సభ్యులపైనే ఆధారపడి ఉన్నా. భృతి చెల్లిస్తే ఇంట్లో వారికి కొంత భారం తగ్గుతుంది. ఇప్పటికే మరోసారి టెట్ పేరుతో డీఎస్సీ నోటిఫికేషన్ దాటవేశారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన మాటపై స్పష్టత కొరవడింది. అంతకన్నా ముందు ప్రతి నిరుద్యోగికి నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పి ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదు. – షాకీర్,ఆలూరు

నిరుద్యోగ భృతి అందించాలి



నా పేరు ఎర్రగుడి నాగరాజు. మాది దేవనకొండ మండలంలోని దిబ్బనగుర్తి గ్రామం. నేను డిగ్రీ, టీటీసీ పూర్తి చేసి కర్నూలులో డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్నా. హాస్టల్ రెంట్, కోచింగ్‌కు కుటుంబ సభ్యులే చెల్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చే వరకు ప్రతినెలా రూ.3 వేలు చొప్పున నిరుద్యోగభృతి ఇస్తామని హామీ ఇచ్చింది. త్వరగా నిరుద్యోగభృతి అందిస్తే మాకు ఎంతగానో ఉపయోగ పడుతుంది.

– ఎర్రగుడి నాగరాజు, దిబ్బనగుర్తి, దేవనకొండ మండలం

నిరుద్యోగభృతిపై ప్రకటనే లేదు



చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగభృతి ఇస్తానని చెప్పారు. అధికారం చేపట్టి నెలరోజులు పూర్తి అయినా ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. నేను బీకాం, టీటీసీ పూర్తి చేసి ఉద్యోగాలకు ప్రయత్నిస్తున్నా. నా వయస్సు 34 సంవత్సరాలు. నా వయస్సుకు నిరుద్యోగభృతి వర్తిస్తుందా లేదో కూడా అర్థం కావడం లేదు.

– కె.అయ్యన్నగౌడ్, డిగ్రీ, టీటీసీ, హాలహర్వి

ఎప్పుడిస్తారో చెప్పాలి



నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. నేను పీజీ పూర్తి చేసి ఇంటి దగ్గరే ఉన్నా. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తే మా కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుంది. నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. – నరసప్ప

కారుమంచి గ్రామం, ఆస్పరి మండలం

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



మాది పేద వ్యవసాయ కుటుంబం. నేను పత్తికొండ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 2017లో బీఏ పూర్తిచేశాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీరుగా పనిచేశా. ప్రస్తుతం నిరుద్యోగిగా ఉన్నా. ఇంటి పట్టునే ఉండి చేసేదేమీ లేక గ్రామంలోనే పొలం పనులకు వెళ్తున్నా. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన హామీ ప్రకారంగా సీఎం చంద్రబాబు నిరుద్యోగ భృతి చెల్లించి నిరుద్యోగులకు ఆసరా ఇవ్వాలి.

– ఇసాక్ అహ్మద్, చిన్నహుల్తి గ్రామం, పత్తికొండ మండలం

నిరుద్యోగతి భృతి ఇస్తారనే నమ్మకం లేదు



2016లో బీకాం కంప్యూటర్స్ ఆదోని సాయి డిగ్రీ కళాశాలలో పూర్తి చేశాను. గతంలో కానిస్టేబుల్ పోస్టుకు ప్రయత్నించి రాత పరీక్షలో విఫలమయ్యాను. ప్రస్తుతం ఉద్యోగం లేకపోవడంతో కుటుంబానికి చేదోడుగా ఉంటూ వ్యవసాయ పనులకు వెళ్తున్నా. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరద్యోగ భృతి ఇస్తాడనే నమ్మకం లేదు. గతంలో రూ.2వేలు ఇస్తామని తన పాలనలో చివరి ఆరు నెలలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈసారి కూడా అలా చేస్తారనే అనుమానం నిరుద్యోగుల్లో నెలకొంది.

– హనుమంతు, ములుగుందం, ఆస్పరి మండలం

హామీ అమలు చేయాల్సిందే



నాపేరు మైనా. ఆలూరు గ్రామం. ఐదేళ్ల క్రితం డిగ్రీ పూర్తి చేశాను. అప్పటి నుంచి అన్ని రకాల పోటీ పరీక్షలు రాస్తున్నా. అయినా ఫలితం దక్కలేదు. ఇప్పుడైనా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ప్రకటించాలి. ఉద్యోగాలు సాధించే వరకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పిన హామీపై ఇప్పటి వరకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. హామీ అమలు చేసి నిరుద్యోగులకు అండగా నిలవాలి. – మైనా, ఆలూరు

సమిత్వ సర్వే త్వరగా పూర్తి చేయండి



పట్టణంలో చేపట్టిన సమిత్వ సర్వే పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు

ఆలూరు రూరల్: సమిత్వ సర్వే ద్వారా ఇంటింటి వివరాల నమోదు త్వరగా పూర్తి చేయాలని పత్తికొండ డివిజన్ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక గుంతకల్లు రోడ్డులో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంటి కొలతలు, హద్దులు, ఇంటి పన్ను రశీదు, కొళాయి పన్ను వివరాలు, ఇంటి నంబర్, యజమాని వివరాలు సేకరించాలని చెప్పారు. అలాగే ఇంటి నిర్మాణానికి పంచాయతీ నుంచి అనుమతులు ఉన్నాయా లేదా అనే వివరాలు తీసుకోవాలన్నారు. రెండు రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మేజర్ గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ వినోద్, సిబ్బంది వరుణ్, సచివాలయ సిబ్బంది రాజన్న పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి

దేవనకొండ: అర్హులైన కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఏఓ సురేష్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బందితో కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ మండలానికి 1,270 సీసీఆర్‌సీ కార్డులు లక్ష్యంగా ఇచ్చారని, త్వరగా కౌలు రైతులను గుర్తించాలని సూచించారు. ఈనెల 19వ తేదీ వరకు ప్రతి గ్రామంలో కౌలు గుర్తింపుకార్డులపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే వారు స్థానిక రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని చెప్పారు.

చేపల పెంపకానికి నేడు వేలం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ సమీపంలోనున్న వీరన్నగట్టు చెరువులో చేపల పెంపకానికి ఈనెల 16వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు కర్నూలు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి. విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 జులై 1 నుంచి 2025 జూన్ 30వ తేదీ వరకు ఏడాది కాల పరిమితికి చెరువులో చేపలు పెంచుకోదలచిన వారు రూ.వెయ్యి దరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. కర్నూలు రేంజ్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి



ఆస్పరి అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థినులు

ఆస్పరి: పాత ముచ్చుమర్రి గ్రామంలో బాలికపై హత్యాచారం చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాల స్కూల్ విద్యార్థినులతో కలిసి అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. ఈశ్వర్ మాట్లాడుతూ 9 ఏళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకొని ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని కోరారు. నాయకులు రాజు, ఉరుకుందప్ప పాల్గొన్నారు.

హొళగుంద: ముచ్చుమర్రి గ్రామంలో బాలికపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని హెబ్బటం గ్రామంలో ఏపీవీబీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. సంఘం నాయకులు, గ్రామస్తులు మాట్లాడుతూ చిన్నారులకు భద్రత లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనాలు పునరావృతం కాకుండా పటిష్టమైన చట్టాలను తీసుకురావాలని కోరారు. అలాగే బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

తన్నుకున్న తమ్ముళ్లు

ఆలూరు: నియోజకవర్గంలోని టీడీపీ నాయకుల మధ్య వర్గపోరు తీవ్రమైంది. సోమవారం నియోజకవర్గ నేత బి.వీరభద్రగౌడ్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగించాలని స్థానిక బళ్లారి రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఓ వర్గం విలేకరుల సమావేశం నిర్వహించింది. అయితే మరో వర్గం నేతలు అక్కడికి చేరుకొని సమావేశంలో ఒకరిపై మరొకరు విమర్శలకు దిగడంతో సమావేశం ముగించుకొని బయటకొచ్చారు. ఈ క్రమంలో.. బెంగళూరు కిశోర్, మసాల జగన్ మధ్య మాటా మాటా పెరిగింది. చివరకు ఒకరిపై మరొకరు దాడులకు చేసుకొని.. పిడిగుద్దులు గుద్దుకున్నారు. ఘటనలో ఇద్దరి చొక్కాలు చిరిగిపోయాయి. విషయం తెలుసుకున్న సీఐ బి. వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎస్‌ఐ ఓబులేసు సిబ్బందితో వెళ్లి వారిని అదుపుచేసి అక్కడి నుంచి పంపించి వేశారు.

దరఖాస్తు చేసుకోండి

కృష్ణగిరి: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామని, అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని అమకతాడు, కంబాలపాడు గ్రామాల్లో సోమవారం కౌలు రైతుల గుర్తింపు సభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో దాదాపు 60 మంది కౌలు రైతులను గుర్తించామని చెప్పారు.

ప్రజల్లో మార్పు తేవాలి

హొళగుంద: మనం మారి ప్రజల్లో మార్పు తేవాలని హొళగుంద, గజ్జహళ్లి పీహెచ్‌సీ డాక్టర్లు న్యూటన్, రాధ, నీతి అయోగ్, ఏబీపీ ఫెలో రవిశంకర్ పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నీతి అయోగ్ ప్రవేశ పెట్టిన సంపూర్ణత అభియాన్ (ఆస్పిరేషన్ బ్లాక్స్) కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు సమావేశం నిర్వహించారు.

18 నుంచి కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే

తుగ్గలి : కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు వైద్యాధికారి మినాజ్ పాషా తెలిపారు. సోమవారం పగిడిరాయి పీహెచ్‌సీలో సర్వేపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు బండయ్య, గోవిందరాజు, కాంతమ్మ పాల్గొన్నారు.

ఎల్లెల్సీకి నీరు విడుదల చేయాలి

హొళగుంద: టీబీ డ్యాం నుంచి తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు నీటిని విడుదల చేయాలని హొళగుంద సింగిల్ విండో మాజీ చైర్మన్ వందవాగిలి మేలగిరి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పుడే నీరు విడుదల చేస్తే రైతులు వరి నారుమడులు సాగు చేసుకుంటారని, అలాగే చాలా ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఆసమస్యకు కూడా పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

రైతులకు బీమా సొమ్ము చెల్లించాలి

ఆస్పరి: గత ఏడాది ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు సంబంధించిన బీమా సొమ్మును వారికి వెంటనే అందజేయాలని సీపీఐ నాయకులు విరుపాక్షి, బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, కృష్ణమూర్తి, నాగేష్, మహానంది కోరారు. సోమవారం ఈ మేరకు తహసీల్దార్ ఈరమ్మకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కౌలు రైతులకు బ్యాంకుల్లో పంట రుణాలు ఇవ్వాలని, పంటలపై జింకలు దాడి చేసి రైతులకు తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయని,రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా చిన్న సరిగెత్తు



వెల్దుర్తిలో లాల్‌సాపీరు స్వామికి గ్రామోత్సవం



ఆస్పరిలో ప్రత్యేక అలంకరణలో పీర్లు

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, శంకరబండ, హాలిగేర, చిగిళి, నగరూరు, తంగరడోణ, ములుగుందం, కారుమంచి, కైరుప్పల, బనవనూరు గ్రామాల్లో సోమవారం చిన్న సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పీర్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. అలాగే చావిళ్ల ఎదుట అగ్ని గుండం ముందు తప్పెట్ల మోతకు యువకులు సాహసేన్ వేశారు. కళాకారుల వివిధ వేషాధారణలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

వెల్దుర్తి(కృష్ణగిరి): మొహర్రంలో భాగంగా వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో ఆదివారం రాత్రి నుంచి చిన్న సరిగెత్తు, పగలు సరిగెత్తును భక్తులు ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి నుంచి చిన్న సరిగెత్తులో భాగంగా పలు చావిళ్లలోని పీర్లు పురవీధుల్లో సవారీ గావించి తిరిగి చావిడిలో కొలువుదీరాయి. వెల్దుర్తిలో సోమవారం ముల్లగేరి పెద్దలాల్‌సా, చిన్న లాల్‌సా పీర్లు పురవీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

మట్టి తరలింపును అడ్డుకోవద్దు



మాట్లాడుతున్న పిక్కిలివానిపల్లె గ్రామస్తులు

వెల్దుర్తి(కృష్ణగిరి): చెరువు మట్టి తరలింపును అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని పోలీసులు బెదిరిస్తున్నారని వెల్దుర్తి మండలంలోని పిక్కిలివానిపల్లె గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివారులోని చెరువులోని మట్టిని ఇటుక బట్టీలకు అధికార పార్టీ నాయకులు అక్రమంగా తరలించేందుకు రావడంతో ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. గ్రామస్తులు ఒప్పుకోకపోవడంతో అధికార పార్టీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. ఈ విషయంపై సోమవారం సాయంత్రం గ్రామస్తులను వెల్దుర్తి సీఐ బీవీ మధుసూదన్ సర్కిల్ కార్యాలయానికి పిలిపించి మట్టి తరలింపును అడ్డుకుంటే గంజాయి, సారాయి కేసులు పెడతామని బెదిరించారని వాపోయారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.